విగ్రహాల ఏర్పాటుకు రూ. 2 లక్షల విరాళం


విరాళం అందజేస్తున్న కార్పొరేటర్ సత్యనారాయణ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి రామాలయంలో 27 అడుగుల ఆంజనేయస్వామి, గరుత్మంతుని విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. దీనికి గాను కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ రూ.2 లక్షలను విరాళంగా అందజేశారు. మంగళవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో ఆలయ ఈఓకు కార్పొరేటర్ చెక్కును అందజేశారు.

చలివేంద్రం ప్రారంభం


మజ్జిగ పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ మాధవరం రోజాదేవి

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్‌లోని సుమిత్రానగర్, జాతీయ రహదారి పైన చైతన్య నగర్, వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలోని చలివేంద్రాన్ని కార్పొరేటర్ మాధవరం రోజాదేవి మంగళవారం ప్రారంభించారు. మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అవసరమైన చోట చలివేంద్రాలు ఏర్పాటు చేయడానికి దాతలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కర్‌రావు, చైతన్యనగర్ కమిటీ మెంబర్స్, సుమిత్రనగర్‌వాసులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి సర్కిల్‌లో రూ.288.13 కోట్ల ఆస్తిపన్ను వసూలు

శేరిలింగంపల్లి: జీహెచ్ఎంసీ పరిధిలోని శేరిలింగంపల్లి సర్కిల్‌లో రికార్డు స్థాయిలో ప్రాపర్టీ ట్యాక్స్ వసూలైంది. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో రూ.288.13 కోట్లు వసూలైనట్లు అధికారులు తెలిపారు. మంగళవారం చివరి రోజు కావడంతో రాత్రి 12 గంటలకు వరకు ట్యాక్స్ చెల్లించేందుకు అవకాశం కల్పించారు. దీంతో భవన యజమానులు చివరిరోజు రూ. 6.93 కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు. కాగా గత ఏడాది రూ. 255.73 కోట్ల ఆస్తిపన్ను వసూలు అయినట్లు తెలిపారు.

తుమ్మల రామకృష్ణకు నివాళి

శేరిలింగంపల్లి: హెచ్‌సీయూ తెలుగు ప్రొఫెసర్, ఆంధ్రప్రదేశ్‌లోని ద్రవిడ విశ్వవిద్యాలయం మాజీ వైస్‌చాన్స్‌లర్ తుమ్మల రామకృష్ణ(68)కు పలువురు ఘన నివాళి అర్పించారు. ఆయన గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం సాయంత్రం మృతి చెందారు. మంగళవారం లింగంపల్లి పరిధిలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. అంతకుముందు హెచ్‌సీయూ తెలుగు విభాగం అధ్యక్షుడు ఆచార్య పిల్లల మర్రి రాములు, పూర్వ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు ఆయనకు నివాళులు అర్పించారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 14 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా నలుగురికి ఒక్కొక్కరికి రూ. 2 వేల చొప్పున జరిమానా, ఎనిమిది మందికి రూ .1500, మరో ఇద్దరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



చందానగర్ : చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గత నెల 22వ తేదీ మదీనాగూడ సిండికేట్ స్టీల్ దుకాణం ముందు గుర్తు తెలియని వ్యక్తి (45) పడి ఉన్నాడు. స్థానికులు 108కి కాల్ చేయగా చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గత నెల 29వ తేదీ మృతి చెందాడు. ఈ మేరకు మంగళవారం పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.




గాలిదొడ్డిలో పాచిపట్టిన నీటి కొలను

నీటిని తోడేస్తున్నారు..

2 వేల అడుగుల లోతుకు పడిపోయిన భూగర్భ జలాలు

- యథేచ్ఛగా అక్రమ నీటి వ్యాపారం
- వాల్టా చట్టానికి తూట్లు.. చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

గచ్చిబౌలి: నీటి అక్రమ వ్యాపారంతో భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయి. ఐటీ కారిడార్‌లో 1500 నుంచి 2 వేల అడుగుల లోతు బోర్లు వేసి నిత్యం నీటిని తోడేస్తున్నారు. ట్యాంకర్ల ద్వారా తరలిస్తున్నారు. వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ ఎలాంటి అనుమతులు లేకుండా వ్యాపారాలు చేస్తున్నారు. ఐటీ కారిడార్‌లోని గాలిదొడ్డిలో నిత్యం వందలాది ట్యాంకర్లు అపార్ట్‌మెంట్లు, టీ కంపెనీలకు వెళుతున్నాయి. గాలిదొడ్డితో పాటు, ఖాజాగూడ, కొత్తగూడ జంక్షన్, మాదాపూర్ సున్నం చెరువు, శిల్పారామం ఎదురుగా తుమ్మిడికుంట, కొండాపూర్ ఆర్టీఏ ఆఫీస్ వెనక భాగంలో, శిల్పా గార్డెన్‌లో ఇళ్ల మధ్య నీటి వ్యాపారం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు ఈ వ్యాపారాన్ని అడ్డుకోవడంలో విఫలమవుతున్నారు.

20 వేల లీటర్ల ట్యాంకర్‌ను 2,500, 10 వేల ట్యాంకర్‌ను రూ.1500, వెయ్యి లీటర్ల ట్యాంకర్ రూ.1000 కి విక్రయిస్తున్నారు.



ట్యాంకర్లను నింపుతున్న దృశ్యం

అడుగంటుతున్న భూగర్భజలాలు

ప్రతియేటా భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయి. ఐటీ కారిడార్‌లో వేల అడుగుల లోతులో బోర్లు వేసి నిత్యం నీటిని తోడుతున్నారు. పెద్ద మోటార్లతో నీటిని తోడుతుండడంతో సమీప కాలనీలలో నీటి సమస్య తీవ్రమవుతోంది. గచ్చిబౌలిలోని ఏపీ హెచ్‌బీ కాలనీలో ఐదేళ్ల క్రితమే ఓ వ్యక్తి తన ప్లాట్‌లో 2 వేల అడుగుల లోతులో బోరు వేస్తే చుక్క నీరు రాలేదు.పలుచోట్ల ఇళ్లకు నీరు కావాలంటే వేల అడుగుల లోతులో బోర్లు వేస్తున్నారు. కొండాపూర్‌లోని రాఘవేంద్ర కాలనీ, గౌతమీ ఎన్‌క్లేవ్‌లో వేసవిలో బోర్లు ఎండిపోతున్నాయి. కేవలం ట్యాంకర్ల నీటిపైనే ఆధారపడుతున్నారు. బోర్లు ఎండిపోయిన కాలనీలు అక్రమ నీటి వ్యాపారులకు వరంగా మారుతున్నాయి.

వాల్టా చట్టం ఏం చెబుతోంది..

నీరు, భూమి, చెట్టు కోసం చేసిన వాల్టా చట్టంలో బోరు వేసినా, బావి తవ్వినా స్థానిక తహసీల్దార్ అనుమతి తప్పక తీసుకోవాలి. అనుమతి లేకుండా బోర్లు వేస్తే తరువాత రెవెన్యూ ఆఫీస్‌లో నమోదు చేసుకోవాలి. అనుమతి లేకుండా వేసిన బోర్లు భూగర్భ జలాలు అడుగంటే విధంగా ఉంటె రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవచ్చు. వాల్టా చట్టానికి అనుగుణంగా వ్యవహరించడం లేదు.

దుర్గంధంగా నీటినిల్వ కొలనులు

ట్యాంకర్లు సాఫీగా వచ్చే.. వెళ్లే వెసులుబాటు ఉన్నచోట గుంత తవ్వి నీళ్లు ఇంకకుండా ప్లాస్టిక్ కవర్‌ను ఏర్పాటు చేస్తారు. చెట్ల మధ్య వేసిన బోర్ల నుంచి మోటార్ల ద్వారా నీటిని ఈ కొలనులలోకి తరలిస్తారు. అక్కడ నుంచి పెద్ద మోటార్‌తో నిమిషాల్లో ట్యాంకర్ నింపుతారు. ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసే ఐటీ కంపెనీలు, హోటళ్లు, గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీలు కేవలం వాడుకునేందుకు మాత్రం ఉపయోగిస్తారు. కాగా రోజుల తరబడి నీటి కొలనులను శుభ్రం చేయకపోవడంతో పాచి పట్టి దుర్గంధం వెదజల్లుతున్నాయి. ఈ నీటితో వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అపరిశుభ్రమైన నీటిని సరఫరా చేస్తూ లక్షల్లో దండుకోవడమే లక్ష్యంగా అక్రమార్కులు వ్యవహరిస్తున్నారు..

ఆలయ నిర్మాణ పనుల పరిశీలన


ఆలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: సంగారెడ్డి నియోజకవర్గ పరిధిలోని ఫసల్వాది గ్రామ శివారులోని శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీ చక్ర ఆలయ నిర్మాణ పనులను ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పీఠం నిర్వాహకులు శ్రీ మహేశ్వర సిద్ధాంతి ఆహ్వానం మేరకు దేవాలయాన్ని సందర్శించామని ఆలయ నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం శివాలయంలో పూజలో పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రం అందజేత


మంజూరు పత్రాలను బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేస్తున్న ఎమ్మెల్యే

శేరిలింగంపల్లి: సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా మంజూరైన రూ. 60 వేలు మంజూరు పత్రాలను ఎమ్మెల్యే గాంధీ మంగళవారం అందజేశారు. భెల్ ఎంఐజీ కాలనీకి చెందిన మెట్ల భాగ్యమ్మ వైద్యం నిమిత్తం సీఎం రిలీఫ్‌ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా మంజూరయ్యాయి. కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, గణేష్ ముదిరాజ్, రాజుయాదవ్, చంద్రకాంత్ రావు తదితరులు పాల్గొన్నారు.

వసంత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం


మోతీనగర్: మూసాపేట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో వసంత నవరాత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ ఆవరణలో ఎస్. పేరని కళాకారుడి ఆధ్వర్యంలో భక్తి సంగీత విభావరి నిర్వహించారు. బుధవారం భజన, సాంస్కృతిక కార్యక్రమాలు, గురువారం స్వర్ణాలయ చక్రవర్తి, వండర్‌బుక్ ఆఫ్ రికార్డు వరల్డ్ రికార్డు గ్రహీత వైఎస్. రామకృష్ణ బృందంచే భక్తి గీతాల విభావరి, 4న భజన, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ తెలిపింది. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి బీ బ్లాక్ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్, ఆలయ కమిటీ చైర్మన్ బాకారం బుచ్చయ్య, ఆలయ కార్యనిర్వాహణాధికారి గుమ్మడిదల సుధాకర్, ఆలయ కమిటీ సభ్యులు అనుపమ, దూడల జనార్దన్ గౌడ్, అనిల్‌కుమార్ ఆచార్యులు, రామకృష్ణ, నాగేశ్వర రావు, మల్లికార్జున రెడ్డి, నాయకులు ప్రతాప్, ఎస్. ఇంద్రజిత్ సింగ్, ఆలయ సిబ్బంది, రాజు, సర్వేష్ తదితరులు పాల్గొన్నారు.


సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులు

నాటకోత్సవం..అభినయం అద్భుతం

అలరించిన సత్యహరిశ్చంద్ర నాటకం

ఫిలింనగర్: ఉగాది నాటకోత్సవాల్లో భాగంగా ఫిలింనగర్‌లోని ఫిలించాంబర్ రామానాయుడు కళామండపంలో రంగస్థల నాటకోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. పాత్తూరి వెంకట సుబ్బారావు నేతృత్వంలో జరుగుతున్న ఈ నాటకోత్సవాల్లో రంగ స్థల కళాకారులు సత్యహరిశ్చంద్ర నాటకాన్ని మంగళవారం ప్రదర్శించి ఆకట్టుకున్నారు. హైదరాబాద్ సురభి కళా నాట్యమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన నాటక ప్రదర్శనలో హరి 1గా దేవనాథ్ సూరి, హరి 2గా సురభి నిఖిలేష్, చంద్రమతిగా లక్ష్మిశ్రీ, నక్షత్రకుడిగా దుర్గా ప్రసాద్, కాలకౌశికుడిగా దర్శి శ్రీనివాసరావు, శిష్యగా నారాయణరావు నటించారు. హార్మోనియం సీహెచ్.నాగేశ్వర్‌రావు, నామా చంద్రబాబు నాయుడు, డోలక్‌తో రామకృష్ణ సహకారం అందించారు. ఈ సందర్భంగా కళాకారులను ఫినిక్స్ ఫౌండేషన్ చైర్మన్ సురేష్ అభినందించారు.



హెచ్‌సీయూ భూముల విక్రయాన్ని తక్షణం ఆపాలి

- కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలను అడ్డుకుంటాం
- బీజేపీ రంగారెడ్డి అర్బన్‌జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

రాయదుర్గం: హెచ్‌సీయూ భూముల పరిరక్షణకు పోరాడుతున్న విద్యార్థులపై కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అణిచివేతను అడ్డుకుంటామని, హెచ్‌సీయూ భూముల విక్రయాన్ని తక్షణం ఆపాలని లేని పక్షంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం గోపన్‌పల్లిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ హెచ్‌సీయూ విద్యార్థుల తెగువకు సెల్యూట్ చేస్తున్నామన్నారు. భూముల వేలంను ఆపుతామనే భయంతో బీజేపీ నాయకులను ఎక్కడికక్కడ హౌస్ అరెస్టులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ప్రభుత్వంగా చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరాగాంధీ కేటాయించిన యూనివర్సిటీకి సమాచారం లేకుండా వేలం వేసేందుకు సిద్ధమవడం కాంగ్రెస్ ప్రభుత్వం దివాళాకోరుతనానికి నిదర్శమన్నారు.ఈ భూములను అమ్మి రూ.30 వేల కోట్ల సేకరించాలని ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాపాలన అంటే ప్రభుత్వ భూములను అమ్మడమా...? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు హామీలు కొండంత, అమలు గోరంతగా ఉందని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బుచ్చిరెడ్డి, వరప్రసాద్, మారం వెంకట్, శ్రీనివాస్ రెడ్డి, జితేందర్, సురేష్,మల్లేష్, మహేష్, అభిషేక్, సాయిమురళి తదితరులు పాల్గొన్నారు.


గోపన్‌పల్లిలో మాట్లాడుతున్న బీజేపీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి తదితరులు

6న 'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఈనెల 6వ తేదీ 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరగనున్న సమావేశంలో 'అండర్‌స్టాండింగ్ ది మెకానిజమ్ ఆఫ్ కర్మ' అనే అంశంపై అమెరికాలోని వర్జీనియాలోని హాస్పిటాలిటీ కంపెనీ అమెరికా అధ్యక్షుడు, సీఈఓ డాక్టర్ పవన్‌కుమార్ ఉపన్యసిస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 040–23001234లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

ముగిసిన ఉగాది వసంతోత్సవాలు

- అలరించిన కూచిపూడి, కథక్ నృత్య ప్రదర్శనలు

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న ఉగాది వసంతోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. శ్రీనాట్యవేద కళాక్షేత్రం పరంజ్యోతి శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో సందర్శకులను అలరించారు. ఇందులో విఘ్నరాజంభజే, అయిగిరి నందిని, మూషిక వాహన, గోవర్ధనగిరిధారి, వెడెలెరా వయ్యారాలు, అదిగో అల్లదిగో, జతిస్వరం, రామచంద్రయ్య, శివాష్టకం తదితర అంశాలను శివాని, నిహారిక, హరిణి, అభిరాం, నైనా, చిన్మయి, ఆశ్రిత, సహస్ర, తదితరులు పాల్గొన్నారు. శ్రీవల్లిరావు శిష్యబృందంచే కథక్ నృత్యప్రదర్శనలో గణేశవందన, గురువందన, శివవందన, తుమ్మేటి, తదితర అంశాలను కళాకారులు శివరాజ్, అక్షిత, రేఖ, హాసిని, శ్రీవల్లి, యుతిక ప్రదర్శించారు.



పేదల కడుపు నింపడమే లక్ష్యంగా సన్నబియ్యం పంపిణీ

- పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ


హనుమాన్ నగర్ కాలనీలో సన్నబియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: పేద ప్రజల కడుపు నింపుడమే లక్ష్యంగా ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిందని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని హనుమాన్ నగర్ కాలనీలో సన్నబియ్యం పంపిణీని బాలానగర్ ఏఎస్ఓ కల్యాణ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న చరిత్రాత్మక నిర్ణయంతో రాష్ట్రంలోని 3 కోట్ల 10 లక్షల మందికి ఆరు కిలోల సన్నబియ్యం అందజేయటం జరుగుతుందన్నారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు

అర్హులందరికీ రేషన్ కార్డులు అందజేస్తామని పీఏసీ చైర్మన్ గాంధీ అన్నారు. రేషన్ కార్డుల పంపిణీ అనేది నిరంతరం జరిగే ప్రక్రియ అని అన్నారు. రేషన్ బియ్యం అవసరం లేని వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మానవతా దృక్పథంతో తిరిగి ఇస్తే పేద కుటుంబాలకు అండగా నిలిచిన వారవుతారని అన్నారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, గణేష్, నాయినేని చంద్రకాంత్‌రావు, రాజుయాదవ్, హరినాథ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, ఎండీ ఇబ్రహీం, ఎల్లంనాయుడు, చంద్రమోహన్ సాగర్, ఎర్ర లక్ష్మయ్య, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.


పటాన్‌చెరులో.. కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

ఎల్లమ్మబండలో...

ఆల్విన్‌కాలనీలోని ఎల్లమ్మబండలో రేషన్‌షాపులో పేద ప్రజలకి సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంబీసీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ జెరిపేటి జైపాల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆల్విన్‌కాలనీ డివిజన్ అధ్యక్షులు మారెళ్ల శ్రీనివాసరావు, శేరిలింగంపల్లి ఏ బ్లాక్ అధ్యక్షురాలు ఉయ్యూరు శ్రీదేవి, యూత్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు సూర్యవంశం రూబిన్, వైస్ ప్రెసిడెంట్ ఎం. రాజా, ఎస్సీ సెల్ సున్నం నారాయణ, జోసఫ్, బీసీ సెల్ సన్యాసి రావు, రామచంద్రుడు, తెనాలి పంతులు, అవాజ్, ఏసు తదితరులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి: దేశంలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జీ వి. జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు. శేరిలింగంపల్లి నల్లగండ్లలోని రేషన్ దుకాణంలో సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 2.81 కోట్ల మందికి లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ రెడ్డి, కిరణ్ కుమార్, ముకుంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరులో..

పటాన్‌చెరు: పేదలకు సన్న బియ్యం అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని నాయికోటి బస్తీ రేషన్ దుకాణంలో లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెల్ల రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారుల కోసం ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ రంగారావు, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాజు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం, ఎస్ఎఫ్ఐ నాయకుల అరెస్ట్

శంషాబాద్: గచ్చిబౌలి హెచ్‌సీయూ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంపై నిరసన వ్యక్తం చేసేందుకు ఆ ప్రాంతానికి వెళ్లేందుకు ప్రయత్నించిన సీపీఎం, ఎస్ఎఫ్ఐ నాయకులను ఆర్‌జీఐఏ పోలీసులు మంగళవారం ఉదయం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు నీరటి మల్లేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె.వై ప్రణయ్ మాట్లాడుతున్న యూనివర్సిటీ భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. అనంతరం సొంత పూచికత్తుపై వారిని విడుదల చేశారు.


ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌లో సీపీఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు

ఫుట్‌పాత్‌లపై డబ్బాలను తొలగించాలని ఫిర్యాదు


ఫిలింఛాంబర్ వద్ద ఏర్పాటు చేసిన డబ్బా

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ ఫిలింఛాంబర్ వద్ద నుంచి కొత్త చెరువు వరకు రోడ్లకు ఇరువైపులా ఏర్పాటు చేసిన డబ్బాలను తొలగించాలంటూ సొసైటీ కార్యదర్శి కాజా సూర్యనారాయణ జీహెచ్ఎంసీ సర్కిల్–18 ఏఎంహెచ్ఓ డాక్టర్ కేఎస్. రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. రాత్రికి రాత్రే ఫిలించాంబర్ వద్ద ఓ డబ్బాను తీసుకొచ్చి పెట్టారని కొంత మంది జీహెచ్ఎంసీ ముసుగులో డబ్బాలు ఏర్పాటు చేసి దందాలు చేస్తున్నారని, దీంతో ట్రాఫిక్ జామ్‌లతో పాటు పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించడంతో పాటు డబ్బాలు ఏర్పాటు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.